## క్లుప్తంగా

### ఇంటర్‌లో ప్రవేశాలకు గడువు పెంపు

వెంకటాపురం(కె) : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశానికి ప్రభుత్వం మూడో విడత గడువు పెంచినట్లు వెంకటాపురం జూనియర్ కళాశాల అకడమిక్ ఇన్‌చార్జ్ అమ్మిన శ్రీనివాస రాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. గతంలో జూలై 31 చివరి తేదీ కాగా దానిని ఆగస్టు 20వ తేదీ వరకు గడువు పెంచినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలో 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా నేడు (గురువారం) ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

### ఏఎస్పీకి సన్మానం



ఏటూరునాగారం : ఏటూరునాగారం డివిజన్ ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శివం ఉపాధ్యాయను కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. డివిజన్ పరిధిలో శాంతిభద్రతల విషయాలను ఏఎస్పీకి వివరించారు. వరద ప్రవాహంపై దృష్టి పెట్టడం సంతోషంగా ఉందని, మంత్రి సీతక్క ఆదేశాల మేరకు గంజాయి నివారణపై ప్రత్యేక దృష్టి సారించడం ఎంతో అభినందనీయమని వెంకన్న తెలిపారు. కార్యక్రమంలో పెద్ది రాజబాబు, దుర్గం అర్జున్, గాయాజ్ పాల్గొన్నారు.

### రక్తదానం.. ప్రాణదానం



కాటారం : మండల కేంద్రానికి చెందిన కడారి విక్రమ్ రక్తదానం చేసి ఉదారతను చాటుకున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రిలో గర్భిణికి బి–పాజిటివ్ రక్తం అవసరమైంది. దీంతో కుటుంబ సభ్యులు మండలంలోని స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు కొట్టె సతీష్‌ను సంప్రదించారు. అతను బి–పాజిటివ్ బ్లడ్ గ్రూప్ ఉన్న విక్రమ్‌కు సమాచారం ఇవ్వగా ఆయన రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసిన విక్రమ్‌ను పలువురు అభినందించి, రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి

గణపురం : మండలంలోని ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడొద్దని ఎస్సై ఆర్.అశోక్ హెచ్చరించారు. ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని ప్రజలకు ఎలాంటి సమస్యలు వస్తే నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైతే 1930కి డయల్ చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్–100కి సమాచారం ఇవ్వడంతో పాటు 87126 58122 ఎస్‌హెచ్‌ఓ నంబర్‌కి ఫోన్ చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో ఎవరైన అనుమానంగా కన్పించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

### అభిప్రాయ సేకరణ



రేగొండ(కొత్తపల్లిగోరి) : కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు తహసీల్దార్ వీరభద్రం ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి అధికారులు అభిప్రాయాలు సేకరించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. పలువురు నాయకులు కార్యాలయాలను గ్రామంలోని ప్రభుత్వ స్థలంలోనే ఏర్పాటు చేయాలని వినతులు అందజేశారు. ఈ కార్యాక్రమంలో సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సై రవికుమార్, ప్రత్యేక అధికారి రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా నిర్వహించాలి

ఏటూరునాగారం : ప్రపంచ ఆటో డ్రైవర్స్ దినోత్సవాన్ని ఆటో డ్రైవర్లు ఘనంగా నిర్వహించుకోవాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సవడ్ల కిరణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాణిరుద్రమదేవి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1న ఆటో డ్రైవర్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకలను ఐదు మండలాల ఆటో కార్మికులు, ఆటో డ్రైవర్స్ పండుగను విజయవంతం చేయాలన్నారు.

# అనుమానితులను గోదావరి దాటించొద్దు



పలిమెల : గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై తమాషారెడ్డి



వాజేడు: ప్రయాణికులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

పలిమెల : అనుమానాస్పద, కొత్త వ్యక్తులను గోదావరి నది దాటించొద్దని ఎస్సై తమాషారెడ్డి గ్రామస్తులకు సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం మండలంలోని సర్వాయిపేట గ్రామంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మావోయిస్టుల దుశ్చర్యలను వివరిస్తూ వారికి సాయం చేయడం, ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని వివరించారు.అలాగే గ్రామాల్లో గుడుంబా విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. మండలంలోని వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు కలిగి ఉండాలని, లేని వారు త్వరగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలని, ఆడపిల్లలను చదువుకు దూరం చేసి బాల్య వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని సూచించారు. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ఎవరు కూడా చేపల వేటకు వెళ్లొద్దని తెలిపారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.మహాదేవ్‌పూర్ ఎస్సై పవన్‌కుమార్, సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

**విస్తృతంగా వాహనాల తనిఖీ**

మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా మండలంలోని సర్వాయిపేట సమీపంలో ఎస్సై తమాషారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులను ఆపి వాటికి సంబంధించిన పత్రాలు పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ అనుమానిత వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



టేకుమట్ల : రాఘవరెడ్డిపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రసాద్



వాహనదారుడిని ప్రశ్నిస్తున్న ఎస్సై

**వాజేడు పరిధిలో..**

వాజేడు : మండలంలోని చీకుపల్లి వద్ద జాతీయ రాహదారిపై వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై రుద్రారపు హరీష్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా వాహనాల తనిఖీతో పాటు బ్యాగులు సోదాలు చేశారు.

**అసాంఘిక శక్తులకు సహకరించొద్దు**

టేకుమట్ల : గ్రామస్తులు అసాంఘిక శక్తులకు సహకరించొద్దని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామంలో మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా వాహనాల తనిఖీ చేపట్టి అసాంఘిక వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో యువకులు అజ్ఞాతంలోకి వెళ్లరాదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత సంక్షేమానికి ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఉద్యమ బాటలో ఎంతో మంది అసువులు బాసిన వారి కుటుంబాలు నిరుపేదలంలో కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. అజ్ఞాతంలో చేరి సాధించేది ఏం లేదని, ప్రతీ యువకుడు ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థానంలో నిలవాలన్నారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టి, అనుమానిత వాహనాల పత్రాలను పరిశీలించి వదిలిపెట్టారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు సుమన్, లవకుమార్, వెంకటేష్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు శ్రీను, తదితరులు ఉన్నారు.

# చెరువు మత్తళ్లకు జాలీలు పెట్టనివ్వాలి

- అడిషనల్ కలెక్టర్‌కు ముదిరాజ్ మహాసభ నాయకుల వినతి



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న ముదిరాజ్ నాయకులు

భూపాలపల్లి రూరల్ : చెరువుల్లోని చేప పిల్లలు బయటికి వెళ్లకుండా మత్తడి వద్ద జాలీలు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. చెరువుల్లోని చేప పిల్లలు బయటికి పోకుండా జాలీలు కడుతుంటే ఇరిగేషన్ ఏఈలు, డీఈలు అడ్డుకుంటూ తమపై కేసులు పెడుతున్నారని భూపాలపల్లి నుంచి కలెక్టరేట్ వరకు నిరసన తెలుపుతూ..ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సదయ్య మాట్లాడారు. జాలీలు లేకుంటే వరదలకు చెరువుల నుంచి చేప పిల్లలు బయటకు వెళ్లిపోతున్నాయని, దీంతో మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా చీఫ్ ప్రమోటర్ చిలుకల పాణి, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల రాజమౌగిలి, ఉపాధ్యక్షుడు చాడ కిష్టస్వామి, మల్లయ్య, జిల్లా మహిళాఅధ్యక్షురాలు బడే పుష్పలత, బోయిని సాంబయ్య, బంటు రమేష్, దాసరి రాజయ్య, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్లు బండి భద్రయ్య, బోయిని తిరుపతి, గడ్డం దుర్గయ్య, రాములు, దార్ల ఆనంద్, బొల్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చేయూత



బియ్యం అందజేస్తున్న మిత్రులు

కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడేనికి చెందిన జాడి మల్లయ్య తండ్రి దుర్గయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా బుధవారం బాధిత కుటుంబానికి మల్లయ్యతో పాటు చదివిన పదోతరగతి స్నేహితులు అండగా నిలిచారు. దశదిన కర్మకు బియ్యం, వంట సామగ్రి అందించి చేయూతనిచ్చారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు కూడా బాధిత కుటుంబానికి బియ్యం, వంట సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో జాడి సత్యం, గాండెర్ల సమ్మయ్య, దుర్యం రాజు, కుమ్మరి నర్సింహారావు, జనార్దన్, కుమ్మరి నాగయ్య, కాంగ్రెస్ నాయకులు జాడి రాంబాబు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాంబశివరావు, బీరెల్లి సంతోష్, లింగయ్య, భిక్షపతి, చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

# సభ్యత్వ నమోదుకు కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇస్సార్‌ఖాన్

మంగపేట : యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదుకు మండలంలోని నాయకులు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష అభ్యర్థి ఎండి ఇస్సార్‌ఖాన్ పిలుపునిచ్చారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మురుకుట్ల నరేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా యూత్‌కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన మంత్రి, జిల్లా అధ్యక్షుడు అశోక్, రాష్ట్ర యువజన సెక్రటరీ సూర్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యువజన కాంగ్రెస్ ఆన్‌లైన్ ఓటింగ్‌లో ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు మండలంలోని 18 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల వయసుగల యువతీ యువకులను ఐవైసీ యాప్ ద్వారా యువజన కాంగ్రెస్ ఆన్‌లైన్ ఓటింగ్‌లో జిల్లాలోనే మండలం నుంచి అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు భానుచందర్, రమేష్, ముకుందం, ఆదినారాయణ, తిరుపతి, నరేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



బహుమతి అందజేస్తున్న సీఐ శ్రీనివాస్

మంగపేట : చెడు వ్యసనాలకు, డ్రగ్స్ మహమ్మారికి యువత దూరంగా ఉండాలని ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఎక్కటి సరోజినీ శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థానిక ఎస్సై టీవీఆర్ సూరి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన డ్రగ్స్‌పై యువతకు అవగాహన సదస్సు కార్యక్రమంలో సీఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నేటి ఆధునిక సమాజంలో యువత చెడుమార్గంలో ప్రయాణించడానికి డ్రగ్స్ ఎలాంటి ప్రమాదకర ప్రభావం చూపుతుందనే విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన యువతపై డ్రగ్స్ ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉద్యోగికి విరమణ సహజం

చిట్యాల : ప్రతీ ఉద్యోగికి విరమణ సహజమని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. మండలంలోని జూకల్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఎర్రం జగదీశ్వర్ పదవీ విరమణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వారు హాజరై మాట్లాడుతూ 37 ఏళ్ల సుదీర్ఘంగా సర్వీస్ చేసి ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని అన్నారు. అనంతరం జగదీశ్వర్ సేవలను కొనియాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునవు కిరణ్‌కుమార్, శనిగరపు భద్రయ్య, మండల నోడల్ ఆఫీసర్ జీ.కృష్ణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, ఉపాధ్యాయురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

**భిక్షపతికి ఆత్మీయ సన్మానం**



భిక్షపతిని సన్మానిస్తున్న నాయకులు

టేకుమట్ల : మండలంలోని గర్మిళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న నేరెళ్ల భిక్షపతి పదవీ విరమణ కార్యక్రమాన్ని గంపల స్వామి అధ్యక్షతన నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, నాయకులు సూదం సాంబమూర్తి, సుల్తాన్‌పాషా, పరంజ్యోతి, ప్రభాకర్‌రెడ్డి, కొట్టె ప్రసాద్, పృథ్వీరాజ్, వనింద్రమణి తదితరులు పాల్గొన్నారు.

**నిబద్ధత కలిగి ఉండాలి**



చాంద్‌మియాను సన్మానిస్తున్న అధికారులు, కార్మికులు

భూపాలపల్లి : విధుల పట్ల ఉద్యోగులు నిబద్ధత కలిగి ఉండాలని ముఖ్య ప్రణాళిక అధికారి శ్యామ్యూల్ అన్నారు. గణాంక అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న పూల రత్నమాలకు బుధవారం సీపీఓ కార్యాలయంలో అధికారులు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సంజీవరావు, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, సీపీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**సన్మానం**

కేటీకే–1 గనిలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన కార్మికుడు చాంద్‌వియాను బుధవారం గని ఆవరణలో అధికారులు సన్మానించారు. గని మేనేజర్ వెంకట్‌రావు, ఇంజనీర్ ప్రవీణ్ చాంద్‌మీయా దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పర్వతాలు, శ్రీనివాస్, సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

**రామ్మూర్తికి సన్మానం**

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామగుండం రామ్మూర్తి–సుమ దంపతుల సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. బుధవారం రామ్మూర్తి పదవీ విరమణ కార్యక్రమం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు, గ్రామస్తులు శాలువాతో సన్మానించారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వాజేడు: పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది



వెంకటాపురం(కె) : పరీక్షలు చేస్తున్న వైద్యులు



కన్నాయిగూడెం: గంగాగూడెంలో..

వాజేడు : మండలంలోని ఏడ్జర్లపల్లి, కొత్త గుడిసెలు, నాగారం గ్రామాల్లో వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్యసిబ్బందితో పాటు గ్రామ పంచాయతీల సిబ్బంది సమన్వయంతో వైద్య పరీక్షలు, శానిటేషన్ పనులు చేశారు. మూడు గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేయడంతో పాటు జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. నిల్వ ఉన్న నీటి వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమల ఉధృతి పెరగకుండా తీసుకోవలిస్న జాగ్రత్తలను వైద్యాధికారి ప్రజలకు వివరించారు. ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. జ్వరాలు వస్తే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఇంటింటి ఫీవర్ సర్వే**

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని చొక్కాల, పాత్రాపురం, తిప్పాపురం గ్రామాల్లో బుధవారం వైద్యసిబ్బంది ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఇంటింటికి వెళ్లి ఇంట్లో ఎంత మంది కుటుంబ సభ్యులు ఉన్నారు.. ఎవరైనా జ్వరంతో బాధ పడుతున్నారా అని అడిగి తెలుసుకోని సర్వే చేపట్టారు. అనంతరం గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వినయ్, ఆశీష్, స్నేహ, సోహేల్, సిబ్బంది జ్యోతి, మహేందర్, యాకలక్ష్మి, రామకృష్ణ, కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

**గంగాగూడెంలో వైద్యశిబిరం**

కన్నాయిగూడెం : వర్షాకాలం సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఉషారాణి అన్నారు. మండలంలో రాజన్నపేట పంచాయతీ పరిధిలోని గంగాగూడెంలో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.ఈ మేరకు గ్రామంలోని ప్రధాన కూడలిలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో వివిధ రోగాలతో బాధపడుతున్న వారు శిబిరం వద్దకు రాగా వారికి వైద్యం చేసి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆశ కార్యకర్తలు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక తొలగింపు



ఇసుకను తొలగిస్తున్న పోలీసులు

కన్నాయిగూడెం : మండలంలోని కంతనపల్లి వద్ద ఏటూరునాగారం, తుపాకులగూడెం ప్రధాన రహదారిపై దొంగలగుట్ట వాగుపై ఉన్న లోలెవల్ వంతెన వద్ద ఇసుకను స్థానిక ఎస్సై వెంకటేష్ తొలగించారు. పొక్లెయినర్ సాయంతో వంతెన లోపల ఉన్న ఇసుకను బుధవారం పూర్తిగా తొలగించి క్లియర్ చేశారు. మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నందున వంతెనలోపలి భాగంలో అంత ఇసుక నిండిపోవడంతో వరదలు రోడ్డు పై నుంచి ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో పాటు ఏటూరు గ్రామపంచాయతీ పరిధిలో రోడ్డుపై గుంతపడడంతో మరమ్మతు చేశారు.

## తహసీల్దార్‌గా శ్వేత

రేగొండ : రేగొండ తహసీల్దార్‌గా శ్వేత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేస్తానని ఆమె తెలిపారు.

## టీఎంఎఫ్ కమిటీల ఎన్నిక



కాటారం : తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం(టీఎంఎఫ్) కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్ మండలాల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎంఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ ములుగుపల్లి పీజీహెచ్ఎం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీల ఎన్నిక నిర్వహించినట్లు ఫోరం నాయకులు తెలిపారు. కాటారం మండల అధ్యక్షుడిగా జెడ్పీహెచ్ఎస్ గణిత ఉపాధ్యాయుడు గంట రాజబాబు, ప్రధాన కార్యదర్శిగా కాటారం ఉపాధ్యాయురాలు కవిత, మహాముత్తారం మండల అధ్యక్షుడిగా కృష్ణమోహన్, మహదేవపూర్ మండల అధ్యక్షురాలిగా సుధారాణి, మల్హర్ మండల అధ్యక్షుడిగా రఘుకుమార్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షులకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. గణిత ఉపాధ్యాయులు పవన్‌కుమార్, శ్రీధర్, రాజేంద్రప్రసాద్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# కృతజ్ఞత సభను విజయవంతం చేయాలి

భూపాలపల్లి అర్బన్ : హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రేపు(శుక్రవారం) నిర్వహించే కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఆర్‌యూపీపీటీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిల్షాద్, వేణు పిలుపునిచ్చారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కోర్టు కేసుల్లో దశాబ్దాల కాలంగా పదోన్నతులు రాక ఇబ్బంది పడుతున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులతో ఇతర సబ్జెక్ట్ టీచర్లకు పదోన్నతులు కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. జిల్లాలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం ఉందని పేర్కొన్నారు.

## రేపు కంటి వైద్యశిబిరం

కాటారం : శరత్ మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జయ ఆప్టికల్స్ అండ్ ఐ కేర్ సెంటర్ వద్ద రేపు (శుక్రవారం) ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ లింగమూర్తి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఉచిత రవాణా, భోజన వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కాటారం సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజలు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లింగమూర్తి కోరారు.

## హెచ్చరిక సూచికలు ఏర్పాటు



రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తున్న సీఐ రవీందర్

గోవిందరావుపేట : వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా రోడ్డు భద్రత చర్యలు పాటించాలని పస్రా సీఐ రవీందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో సీఐ ప్రధాన రహదారిపై సోమలగడ్డ క్రాస్ వద్ద డివైడర్ ప్రారంభంలో ప్రమాద హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేశారు. ట్రాక్టర్ టైరుకు ఇరువైపులా రేడియం స్టిక్కర్ అతికించి డివైడర్ మధ్యలో ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి పూట రహదారిపై వాహనాలు డ్రైవ్ చేసే వారు గమనించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడతారని తెలిపారు.